# వల

"రామారావు సంగతి చెప్పరా..." కృష్ణ అన్నాడు. నేను మాట్లాడలేదు ముందుకు నడిచాను.

"ఎంత అడిగినా, వాడి సంగతి మాత్రం చెప్పవేంటిరా?" మళ్ళీ అడిగాడు కృష్ణ.

రామారావు మా చిన్ననాటి స్నేహితుడు. కృష్ణ లాగే వాడూ నాకు ఆప్తుడే.

నాలుగేళ్ళ తరువాత కలిసాడు కృష్ణ. బీచ్ రోడ్డున నడుస్తూ, చిన్ననాటి స్నేహితుల గురించి ముచ్చటించుకుంటున్నాం. జీవితపు అపరాహ్న వేళలో అస్తమించే సూర్యుని వైపు అడుగులు వేసే మాలాంటి వారికి, చిన్ననాటి విషయాలు ముచ్చటించుకోవటంకన్నా ఆనందం ఏముంటుంది!

"ఏం చెప్పమంటావురా...?" నిరుత్సాహంగా అన్నాను, నేను ముందుకు నడిచి బీచ్ ఒడ్డున వున్న గోడమీద కూర్చున్నాను.

"మంచో, చెడో తెలిసినవి అందరి గురించి చెప్పావు కదూ, రామారావు గురించి మాత్రం చెప్పవేంటిరా?" కృష్ణ ఆత్రుతగా అడిగాడు.

"ఏమైందిరా వాడికి...?"

ఎదురుగా జీవితంలా విస్తరించి వున్న సముద్రం వైపు దృష్టి మళ్ళించాను. మనిషి ధనదాహం లాంటి అలలు ముందుకు వచ్చి అడ్డుగోడని ఢీ కొడుతున్నాయి... గోడ మీద అక్కడక్కడ పగళ్ళూ...

సముద్రంలో వేటకి వెళ్ళి వచ్చిన కొందరు జాలర్లు ఒడ్డునపడివున్న పడవల్లో విశ్రమిస్తున్నారు. కొందరు రేపటి వేటకి తయారవుతున్నారు. వలలు దులిపి ఆరేస్తూ ఆనాటి లాభనష్టాల లెక్కవేస్తున్నారు.

అవును మరి! జీవితం లాభనష్టాల లెక్కగా మారిపోయింది కదా!

జీవితంలో అలా చేపల వేటలో కూడా, అదృష్టం అందరిని ఒకలా వరించదు కదా! కొందరికి రొయ్యలు దొరికితే, కొందరికి వంజిరాలు, మరికొందరికి తూరేగలు దొరుకుతాయి.

"మాట్లాడవేంటిరా?" సహనం కోల్పోయిన కృష్ణ గట్టిగా అడిగాడు.

ఇక రామారావు గురించి చెప్పకుండా వుండటం కుదరదని అనుకున్నాను.

"నీకు తెలుసుకదరా, రామారావు ముక్కుసూటి మనిషి, చిన్న ఉద్యోగమే అయినా డబ్బు చేసుకోగల ఉద్యోగం అయినా, న్యాయం, ధర్మమని కూర్చుని ఎవరివద్ద పైసా తీసుకునేవాడు కాదని తెలుసుగా..." సిగరెట్టు వెలిగిస్తూ అన్నాను.

"తెలుసు, తెలుసు. ఈ కాలంలో మడికట్టుకొని కూర్చుంటే లాభంలేదని కూడా చెప్పాను."

"నేనూ అన్నాను రా, వింటేగా..." గట్టిగా పొగపీల్చి అన్నాను.

"ఇప్పుడు సఫర్ అవుతున్నాడు"

"ఏమైందిరా...?"

"చివరిదశలో వాడే కక్కుర్తిపడ్డాడో, లేకపోతే అడ్డు తొలగించటానికి ఎవ్వరైనా ఇరికించారో తెలియదు కాని అవినితీ నిరోధక శాఖ వారికి దొరికిపోయాడు రా..."

"రామారావే...!"

"నాకూ అదే ఆశ్చర్యంగా వుంది. తీసుకున్నదెంత... పెద్ద మొత్తం ఏమికాదు... రెండు వేలు... అయినా శిక్ష మామూలేగా..."

"అంటే..."

"ఉద్యోగం నుంచి తీసేసారు పాపం! పెన్షన్ కూడా ఆపేసారట..."

కృష్ణ నోటమాట రాలేదు. సిగరెట్ పీక నులిపి పారేసి గోడ మీద నుంచి లేచాను. జాలర్లు మాట్లాడుకుంటున్నారు. "వల మార్చాలయ్యా..." జాలరి కుర్రవాడు తండ్రితో అంటున్నాడు... "పెద్ద చేపలు అసలు వలలో చిక్కటం లేదు. చిన్న చేపలని పట్టి మనమూ బ్రతికేవున్నామని అనిపించుకోవచ్చు కాని ప్రయోజనం ఏమిటయ్య"

నిజమే. నేను లేచాను వలమార్చాలి. పెద్ద చేపలే కావు తిమింగలాలు కూడా తప్పించుకోలేని వల తయ్యారు చెయ్యాలి.

***